# మిత్రద్రోహం

నాకేదో యింత భగవంతుడిచ్చాడు. నేను జైలుకి వెళ్ళినవాణ్ణి కాకపోయినా నా కొడుకులిద్దరూ ప్రభుత్వోద్యోగాలు చేసుకుంటున్నారు. వెనక దొరల ప్రభుత్వంలో ఎంత శ్రద్ధగా తమపని చేసుకొనిపోయినారో ఇప్పుడు మన కాంగ్రెసువాళ్ళ కిందకూడా అంత శ్రద్ధగానూ ఉంటున్నారు. ఇళ్ళ అద్దెలమీద, పొలంమీద నాకేదో ఏటా రెండు మూడువేలు వస్తుంది. అందుచేత నాకు ఇహ చింత లేదు. నేనేమో నా భగవధ్ధ్యానమేమో !

అందుచేత నాకు సీతారామస్వామి ఎక్కువా లేదు. రఘుపతి తక్కువా లేదు. ఇద్దరూ నాకు కావలసినవాళ్ళే. వాళ్ళిద్దరికీ చెడ్డదంటే, మీరు నమ్మరుగానీ నేనెంతో ఖేదించానన్న మాట.

మేము ముగ్గురమూ విడవకుండా తిరిగేవాళ్ళం. అదేం చిత్రమో, ప్రపంచం మంచి ఎక్కడవున్నా సహించలేదుగద. మేము ముగ్గురమూ కలిసి తిరిగితేనే మా సహాధ్యాయులు సహించలేకపోయారు. మమ్మల్ని విడగొట్టటానికి ఎన్ని ప్రయత్నాలు చేశారు. రఘుపతితో అనేవాళ్ళుగదా "ఒరే,

నీతో కలిసి చదవకపోతే స్వామికి ఇంగ్లీషులోనూ, లెక్కల్లోనూ సున్నాయే. అటువంటి వాడితోకన్నా మరెవరైనా ఇంకా తెలివిగలవాడితో కలిస్తే ఇంకా మార్కులు ఎక్కువ వస్తాయిరా!" అనేవాళ్ళు. రఘుపతి తండ్రి తద్దినాలు పెట్టడనీ, వితంతు వివాహాలు జరిగితే వెళతాడనీ నాతో చెప్పేవాళ్ళు. నేనూ, రఘుపతీ వెళ్ళి రాత్రిపూట స్వామి ఇంట్లో చదువుకుని కిరసనాయిలు ఆదా చేస్తున్నామనికూడా అన్నారనుకోండి.

అయినా మేం చీలిపోలేదు. మాది అంత మంచి స్నేహం. నేను చదువు మానేసినాకకూడా వాళ్ళిద్దరూ బి.ఎ. దాకా కలిసి నెట్టారు. వాళ్ళిద్దరూ పాసయితే నేనుకూడా బియ్యే పాసయినట్టే సంతోషించాననుకోండి. మాది అటువంటి స్నేహం.

కావటానికి మాలో స్వామి కాస్త ధనికుడే. రఘుపతి కూడా నాకంటె యింత కలవాడే. అయితే మాలోమేం అటువంటి పట్టింపులెప్పుడూ కలవాళ్ళంకాం. ఇంత కాలానికి రఘుపతి,స్వామి కలిమిచూచి అసూయ పడుతున్నాడనుకోవడానికి నాకేమాత్రమూ మనస్కరించలేదు. కాని స్వామి మీద రఘుపతిచేసే దుష్ప్రచారానికి మరే ఆధారం ఉండదనుకోవాలి.

స్వామి దాదాపు రెండులక్షలు చేసుకున్నాడంటే నిజంగా సంతోషించవలసిన వాళ్ళలో నేనూ రఘుపతి మొదటివాళ్ళం. నేను సంతోషించాను. రఘుపతి మరొకలాగా మాట్లాడ నవసరమేముందీ ?

పోనీ స్వామి కూడనిపని ఏమన్నా చేశాడు గనకనా? చేనేత గుడ్డల వ్యాపారం చేసుకున్నాడు. అతను చేసిన పెట్టుబడి పదివేలే అయినా రోజులు కలిసిరావటంవల్ల అంతకు ఏడింతలు లాభించింది. ఏ రకమన్న తరవాత లాభాలే ఉంటాయనేమిటి ? రఘుపతికూడా చేనేత గుడ్డల వ్యాపారం చేసినవాడేగా. ఎందుకు నష్టపడ్డాడూ ? తనకు నష్టం వచ్చిందిగనక లాభం వచ్చినందుకు స్వామిని ఆడిపొయ్యటం ఏం సబబుగా వుందీ ?

నన్నడిగితే డబ్బుకన్న పాపిష్టిది లేదు. దరిద్రులే సంఘానికి శత్రువులు. పాకీవాళ్ళు చూడండి. కార్మికులు చూడండి. రైతుకూలీలు చూడండి. వీళ్ళు మనకు తెచ్చే అగచాట్లకు అంతంటూవుందా ? హత్యలూ, దొంగతనాలూ, దోపిడీలూ చేసేది ఎవరు ? రఘుపతి యివ్వాళ దరిద్రుల జాబితాలో చేరాడు. అందుచేత అతను ఏమన్నా నా కాశ్చర్యం లేదు. డబ్బు పాపిష్టిది !

ఇద్దరూ ఒకే వ్యాపారం చేస్తే చేశారు. కలిసి చెయ్యకుండా ఎవరి దారిని వాళ్ళు చేసుకుంటే అదెట్లావుండేదో, రఘుపతి వెళ్ళి స్వామితో ఎందుకు కలవటం ? తన గుడ్డల కొట్టేమో, తానేమో అన్నట్టుంటే ఏ పేచీ లేకపొయ్యేదిగా ? స్వామికి పెట్టుబడి చాలనిమాట నిజమేననుకొందాము. అంత చాలకపోతే వున్నదానివిూద రాబడితోటే తృప్తిపడేవాడో, ఎక్కడైనా తల తాకట్టుపెట్టి తెచ్చుకునేవాడో, రఘుపతి కెందుకూ ? డబ్బు దగ్గిరనా స్నేహితాలు?

తనుకూడా స్వామికి పదివేలిచ్చాడు. స్వామి తయారుచేయించే బట్టలు జిల్లా అంతటా తానే అమ్మి లాభాలు తీద్దామని ఆశ పడ్డాడు. రఘుపతి యిచ్చిన డబ్బు స్వామి తన వ్యాపారంలో పెట్టుబడి చేసుకున్నాడు. దానివల్ల వ్యాపారం బాగా సాగిందికూడాను. సాగినంత కాలమూ రఘుపతి వ్యాపారం కూడా బాగానే సాగింది. స్వామి రఘుపతికి ఒక్కడికే రెండు మూడు లక్షల రూపాయలగుడ్డ అందించాడు. రఘుపతి ఆ డబ్బంతా ఎప్పటికప్పుడు స్వామికి పంపుతూ వచ్చాడనుకోండి. దానివల్ల తన వ్యాపారమే పెంచుకున్నాడు. కాని స్వామికి ఒరగబెట్టిందేముంది. నేతగుడ్డకి ధరలు పడిపోతాయని ముందుగానే తెలుసుకుని స్వామి వ్యాపారం ముగించుకుని దీపం వుండగా ఇల్లు చక్కబెట్టుకున్నాడు. రఘుపతి కా అవకాశం లేకపోయింది. పదివేలరూపాయల గుడ్డ అతని దగ్గిర మిగిలిపోయింది. దానిక్కూడా యిప్పుడు ధర పడిపోయిందనుకోండి. దాని కెవరేం చేస్తారూ ?

ఇద్దరూ కలిసి అయిదారేళ్ళు వ్యాపారం చేశారు గదా, ఇప్పుడు తీరా వ్యాపారం అయిపోయినాక తనను ముంచాడని స్వామిని గురించి రఘుపతి ప్రచారం చెయ్యటం ఏమైనా బాగుందా ? అవును స్వామికి వ్యాపారం కలిసి వచ్చింది. రాహు మహాదశ ఆరంభంకాగానే అతనికి సిరి ఎత్తుకుంటుందని రాసిపెట్టేవుంది. "తనతో సమంగా నేనూ పెట్టుబడి చేశాను. తన లాభాలలో నాకు దమ్మిడీ యివ్వలేదు ?" అంటాడు రఘుపతి. "రఘుపతి నా చేతికిచ్చిన ప్రతిదమ్మిడీకి

లెక్క నాదగ్గిరనే వుంది. అంతకీ నేను గుడ్డ అందిస్తూనే వచ్చాను." అంటాడు స్వామి.

రఘుపతి యింకా అసందర్భాలు చాలా చెబుతాడనుకోండి. నేతగుడ్డలో ముతకరకం వేలకువేల సరకు ఖద్దరుకింద బొంబాయికి స్వామి ఎగుమతి చేశాట్ట. దానిమీద చాలా లాభాలు తిన్నాట్ట. తనకు తెలియకుండా తనమీదపోటీకి చౌకగా మాజిల్లాలోనే యింకా యితరులకు స్వామి గుడ్డ అమ్మాట్ట. చేనేత వ్యాపారంమీద లాభాలతో స్వామి ఇంకా అనేక వ్యాపారాలు చేశాట్ట. స్వామి తన వ్యాపారం మానలేదని, ఇప్పుడు చేనేతగుడ్డ ఎగుమతికి ప్రయత్నాలు సాగిస్తున్నాడని తన బంధువు లందరిపేరా వ్యాపారం పంచి ఏవో తంత్రాలన్నీ పన్నుతున్నాడని, ఇదంతా తనను మోసగించటానికేనని కూడా రఘుపతి చెబుతున్నాడు. ఈమాట లన్నిటికీ ఎక్కడికి ? ఇందులో వ్యాపారపు కిటుకు లెన్నివుంటాయో నాబోటివానికేం తెలుస్తుంది ?

స్వామి పెద్దమనిషి. అతను రఘుపతి వ్యాపారం చెడిపోయినందుకు చాలా విచారిస్తున్నాడని నేను చెప్పగలను. చేసుకోవటం చేతకాక, పనికిమాలిన గుడ్డ యావత్తూ తన దగ్గిర పేర బెట్టుకున్నాడని, అంతా అమ్ముకుని వుంటే రఘుపతి నష్టపడేవాడుకాడని ఆపత్సమయంలో అతను తననేమైనా అంటే అంతమాత్రంచేత తను ఏమీ అనుకోబోవటంలేదని, ఇప్పటికైనా అతను జారిపోకుండా నిలబడితే చక్కగా వ్యాపారంమాట చూచుకోవచ్చునని స్వామి నాతో అన్నాడు. స్వామికి గొప్ప గొప్ప వాళ్ళ దగ్గిర చాలా పలుకు

బడి ఉంది. అతని ఇంటిదగ్గిర రోజూ కవులూ, రాజకీయ వేత్తలూ, పండితులూ, ఇతరులూ చేరటం నేను కళ్లారా చూచాను అతను చేసే దానాలకి అంతే లేదనుకోండి. వెధవది ఏ కమ్యూనిస్టులో స్వామిని అనవలసిన మాటలు రఘుపతే అంటున్నాడంటే అతన్ని గురించి పెద్దమనుషు లేమనుకుంటారో నాకు బోధపడకుండా ఉంది !

ఎన్నయినా చెప్పండి. డబ్బు చాలా పాపిష్టిది. అది యుక్తాయుక్తాలు కూడా తెలియనివ్వదు.